# వెలలేని వెచ్చదనం



*విక్రీణీతే మాఘమాసే*
*పామరః ప్రావరణం బలీవర్దేన*
*నిర్ధూమ ముర్మురనిభౌ*
*శ్యామల్యాః స్తనౌపశ్యన్*

***భావం:*** పొగ రాని కుంపటి వలె వెచ్చదనం ఇచ్చిన ఆమె సాంగత్యం చూసిన రైతు శాలువాను మారకంగా ఇచ్చి మాఘమాసంలో ఎద్దును కొన్నాడు.

సంక్రాంతి పండుగ వచ్చింది. రైతులందరూ పండుగ జరుపుకుంటున్నారు. ధాన్యాన్ని ఇంటికి తెచ్చుకున్నారు. ఏడాదికి సరిపడే

ధాన్యాన్ని ఇంట్లో ఉంచుకుని మిగిలిన ధాన్యంతో రాబోయే సంవత్సరానికి వ్యవసాయపు పనిముట్లను ఇంటికి అవసరమైన పదార్థాలను కొనుక్కున్నారు. పండుగ వెళ్ళిపోయింది. మాఘమాసం వచ్చింది. రైతు వీరేశానికి కష్టం తెచ్చింది.

నాగలికి కట్టే ఎద్దులలో ఒకదానికి కాలు విరిగింది. ఇంకొక ఎద్దు కొనాలి. కొనడానికి ధాన్యం లేవు. ధనం అసలే లేదు. ఎద్దులు కొంటే కానీ వ్యవసాయం చేయలేదు. మాఘ మాసంలో పశువుల సంతలో ఎద్దులు చవకగా దొరుకుతాయి. వీరేశం ఆలోచిస్తూ ఇంటికి వచ్చాడు. ముభావంగా ఉన్న భర్తను చూసి భార్య పలకరించడానికి తటపటాయించింది. పిల్లలను కూడా 'నాన్నగారు అలసి పోయి ఉన్నారు. విసిగించకండి' అని హెచ్చరించింది. రాత్రి భోజనవేళ కూడా వీరేశం మాట్లాడలేదు. పిల్లలు అన్నం తిని నిద్రపోయారు.

మాఘమాసం కనుక చలి ఎక్కువగా ఉంది. వీరేశం శాలువ కప్పుకుని మంచం మీద పడుకున్నాడు. భార్య వంటిల్లు సర్దుకుని వచ్చి మంచం మీద కూర్చుంది. ఆలోచనలలో ఉన్న వీరేశం కదలలేదు. "ఎందుకలా ఉన్నారు?" అంది. వీరేశం పలకలేదు. ఆమె నెమ్మదిగా తనచేతిలో వీరేశం చేయి తీసుకుని రెండవ చేతితో నిమురుతూ "దేనికో కలవరపడుతున్నారు. నాకు విషయం చెప్పండి. నేను సహాయం చేయలేను. కానీ సమస్య చెప్తే మనస్సు తేలికఅవుతుంది." అంది. ఆమె చేతి స్పర్శకీ, అనునయంగా పలికిన ఆమె మాటలకూ అతను పరవశుడయ్యాడు. విషయం చెప్పాడు.

"అమ్మో దానికంత ఆలోచించాలా? ఈ చంద్రహారం తీసికెళ్లి మారకంగా ఇవ్వండి. మళ్లీ పంట వచ్చినప్పుడు చేయిద్దురు కానీ" అంది.

"మళ్లీ ఏడాది పంటవరకూ బోసి మెడతో ఉంటావా? అప్పుడు ఇంకే ఖర్చులు వస్తాయో? నీకేనాడు నగలు చేయించలేదు. ఉన్నవి కూడా అమ్మేయ్యనా?" అన్నాడు.

"మీ సన్నిధిని మించిన నగ ఉందా" అంటూ ఆమె అతని దగ్గరగా జరిగింది. వీరేశం మనస్సు ఆనందంతో పొంగిపోయింది. వేసవిలో చల్లదనాన్నీ శీతాకాలంలో వెచ్చదనాన్నీ భర్తకు ఇచ్చే స్త్రీని వరవర్ణిని అంటారట. అటువంటి ఉత్తమ స్త్రీ భార్యగా దొరకడం కన్నా భాగ్యం ఏముంది? కుంపటి వెచ్చదనం మాత్రమే ఇస్తుంది. కానీ పొగతో కళ్ళను మండిస్తుంది. ఇటువంటి ప్రేమమయి అనురాగమనే వెచ్చదనం మాత్రమే ఇస్తుంది. ఆమెకు చంద్రహారం అక్కరలేదు. తనకు శాలువా అవసరమా? అనుకున్నాడు.

వీరేశం ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చాయి. అతను మర్నాడు శాలువా తీసుకుని సంతకు వెళ్ళాడు. జరీపూలతో ఉన్న కాశ్మీరు దేశపు శాలువాకు అతనికి మంచి ఎద్దు మారకానికి దొరికింది.

"చలి తీవ్రంగా ఉన్న మాఘమాసంలో శాలువాని అమ్మేస్తున్నాడేమిటి? ఇతను వెర్రివాడా" అనుకున్నాడు ఎద్దుల వర్తకుడు. భార్యాభర్తల అనురాగ దీపం ఇంటికి వెలుగూ, వెచ్చదనం ఇస్తుంది కదా.

******